నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
6 | మహబూబ్‌నగర్, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

ప్రజలకు అండగా.. గులాబీ జెండా

- రజతోత్సవ జాతరకు దండులా కదలాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 19: ప్రజలకు అండగా గులాబీ జెండా ఎల్లప్పుడూ ఉంటుందని ప్రతి కార్యకర్తను పార్టీ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని కార్యకర్తలు పార్టీకి అండగా ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు భారీగా ప్రజలు, కార్యకర్తలు, గులాబీ అభిమానులను తరలించడంలో భాగంగా కేటీదొడ్డి మండలంలోని పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బాసు హనుమంతునాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి గులాబీ జాతరకు దండులా కదలాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలతో గులాబీ జాతరకు వెళ్లే ముందు పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా ఎల్లప్పుడు ప్రజల పక్షాన పార్టీ ఉంటుందని రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, నీళ్లు, నిధులు, నియామకాల కోసం కేసీఆర్ పార్టీ స్థాపించారన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశం గర్వించేలా అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతూ సబ్బండ వర్గాలకు అండగా నిలిచిన ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. రాష్ట్ర సాధనకు పదవులను లెక్కచేయలేదని, చావుదాకా వెళ్లి తెలంగాణను సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. 25ఏండ్ల బీఆర్ఎస్ ప్రస్థానాన్ని రజతోత్సవ సభ ద్వారా భావితరాలకు స్ఫూర్తి కలిగించాలని కోరారు. 14ఏండ్ల ఉద్యమ చరిత్ర, 10ఏండ్ల అధికారంలో తెలంగాణ కేసీఆర్ నాయకత్వంలో సుభిక్షంగా మారిందని, కొంతమంది కుతంత్రాల వల్ల అధికారం కోల్పోయిన ప్రజల్లో అభిమానం తగ్గలేదని చెప్పారు. కేసీఆర్ విలువ, బీఆర్ఎస్ అవసరం ప్రస్తుతం ప్రజలకు తెలిసి వచ్చిందన్నారు. ప్రతి సమావేశంలో పార్టీకి ద్రోహం చేసిన ఎమ్మెల్యే పేరును ఉచ్చరిస్తే మిమ్మల్ని మీరే తగ్గించుకున్నట్లని చెప్పారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెంది దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. సోషల్ మీడియా వేదికగా వరంగల్ సభ ప్రచారం నిర్వహించాలని కోరారు.

అంతకు ముందు మాజీ మంత్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉమిత్యాలతండాకు చెందిన కొంత మంది యువకులు మాజీ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, కుర్వ పల్లయ్య, శేఖర్‌నాయుడు, వీరేశ్, చక్రధర్‌రావు, శ్రీరాములు, మోనేశ్, బొజ్జయ్య, మగ్బూల్, రవి, నాగరాజు, నర్సింహులు, ఆంజనేయులు, తిమ్మప్పతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి రీకన్‌స్ట్రక్షన్

ఊర్కొండ, ఏప్రిల్ 19: గ్యాంగ్‌రేప్ కేసులో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా శుక్రవారం నలుగురి నిందితులను విచారించగా.. శనివారం మరో ముగ్గురు నిందితులు మహేశ్‌గౌడ్, కౌకుంట్ల హరీశ్‌గౌడ్, మట్ట ఆంజనేయులుగౌడ్‌ను ఆలయ ప్రాంగణం నుంచి గ్యాంగ్‌రేప్ జరిగిన స్థలానికి తీసుకెళ్లి విచారించారు. అనంతరం నిందితులను వారి గ్రామానికి తీసుకొచ్చి వారి ఇండ్లల్లో కేస్ రీకన్‌స్ట్రక్షన్‌లో విచారణ నిర్వహించారు. హరీశ్, మహేశ్ ఇరువురిని వారి ఇండ్లల్లో విచారించారు. మట్ట ఆంజనేయులు గౌడ్‌ను మాత్రం విచారణకు వాహనం నుంచి గ్రామంలో దించలేదు. అనంతరం హరీశ్ గౌడ్‌కు చెందిన బైక్‌ను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ప్రోటోకాల్ రగడ

- 'భూ భారతి'లో వివాదం
- మంత్రి ముందే సరిత వర్గీయుల రచ్చరచ్చ
- పోలీసులు, నాయకుల మధ్య తోపులాట
- బుజ్జగించేందుకు ఎంపీ ప్రయత్నం

పోలీసులు, సరిత వర్గీయుల మధ్య వాగ్వివాదం

గద్వాల, ఏప్రిల్ 19 : గద్వాల నియోజకవర్గంలోని ధరూర్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ప్రోటోకాల్ వివాదం తలెత్తింది. ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభం కాగానే మంత్రి ఎదుటే మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వర్గీయులు ఆందోళన చేసి ప్రోటోకాల్ రగడ సృష్టించారు. దీంతో గద్వాల కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. వేదికపైకి స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని ఆహ్వానించి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరితను ఆహ్వానించకపోవడంతో వారి అనుచరులు ఆందోళనకు దిగారు. సరిత కార్యకర్తల మధ్యే కిందకూర్చోగా, సంపత్‌కుమార్ తన వాహనంలో కూర్చున్నారు. వీరిని బుజ్జగించి తీసుకురావడానికి నాగర్‌కర్నూల్ ఎంపీ వెళ్లినప్పటికీ సంపత్‌కుమార్ స్టేజీ వద్దకు రాలేదు. స్టేజీ వద్ద ఆందోళన చేస్తున్న సరిత వర్గీయులను ఎంపీ బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినిపించుకోలేదు. స్టేజీపై ఎమ్మెల్యే మాట్లాడే క్రమంలో సరిత వర్గీయులు కాంగ్రెస్ కండువా కప్పుకొని మాట్లాడాలని, ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతున్నప్పటికీ కార్యకర్తలు వారి ప్రసంగాలకు అడ్డు తగులుతూనే ఉన్నారు. ఒక దశలో సహనం కోల్పోయిన కార్యకర్తలను పోలీసులు బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోక పోవడంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో సరిత వర్గీయులను పోలీసులు బయటకు పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రంలో పోలీసులపై సరిత అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని వదిలి అవకాశం కోసం పార్టీలో చేరిన వారిని అందలం ఎక్కించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిసారి మమ్మల్ని అవమానాలకు గురిచేస్తున్నారని సరిత ఎంపీ ముందు ఆవేదనను వెళ్లగక్కారు. వహించిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లి పోయారు. సభాస్థలం వద్ద సరితతో మంత్రి ఆందోళనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెలీప్యాడ్ వద్ద సరిత తిరుపతయ్య తోపాటు కాంగ్రెస్ కార్యకర్తలతో మంత్రి పొంగలేటి మాట్లాడారు. పార్టీ కోసం పనిచేస్తున్న మమ్మల్ని అవమానాలకు గురిచేస్తున్నారంటూ మంత్రికి తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో పార్టీ పరువు పోకూడదని సహనం వహిస్తున్నామన్ని, మా సహనాన్ని పరీక్షించొద్దని చెప్పారు. మళ్లీ మాట్లాడతానంటూ మంత్రి హెలీప్యాడ్ వైపు వెళ్లి పోయారు.

గిరిజన రైతుల ఆక్రోశం

- వనపర్తి–పెబ్బేరు రహదారిపై ధర్నా
- నెల రోజులుగా వడ్లు కొనడం లేదని ఆగ్రహం
- స్థంభించిన రాక పోకలు, డీఎస్‌వో హామీతో విరమణ

వనపర్తి–పెబ్బేరు రోడ్డుపై నిరసన తెలుపుతున్న పెద్దగూడెంతండా రైతులు

వనపర్తి, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): వారం రోజులుగా తమ వడ్లు కొనడం లేదని వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు చెందిన గిరిజన రైతులు రోడ్డెక్కారు. శనివారం వనపర్తి–పెబ్బేరు రోడ్డుపై తండా రైతులు 100మంది మొహరించి రాస్తారోకో చేశారు. నెల రోజుల నుంచి వరి కోతలు కోసి సెంటరులో వడ్లు ఉంచామని, ఇటీవల ఎమ్మెల్యే సెంటరును ప్రారంభించినా.. కొనుగోలు చేయడం లేదని రైతులు ఆరోపించారు. మొక్కుబడిగా ఒక రోజు 140సంచులు తూకం వేసి మళ్లీ నిలిపివేశారని, దీంతో విధిలేని పరిస్థితుల్లో రోడ్డెక్కాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు తమ ధాన్యం బాగా లేదని సాకులు చెప్పి తరుగు పేరుతో దోపిడీకి దిగుతున్నారని వాపోయారు. ఇప్పటికే 40 కిలోల సంచికి 1300 గ్రాములు అధికంగా తూకం చేస్తున్నారని, ఇంకా కావాలంటే ఎక్కడినుంచి తేవాలని ప్రశ్నించారు. ధర్నా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు, డీఎస్‌వో విశ్వనాథ్ పెద్దగూడెం తండాకు చేరుకున్నారు. మిల్లర్ల ప్రతిపాదనను డీఎస్‌వో రైతుల ముందుంచితే, రైతులు అంగీకరించలేదు. మంచిగా వడ్లను తూర్పు పట్టాలని షరతు పెడితే, రైతులు ససేమిరా అన్నారు. గతంలో నుంచి చేసినట్లుగానే ఇప్పుడు కూడా చేస్తున్నామని, మళ్లీ కొత్తపద్ధతిలో ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. అయితే, శుభ్రంగా ఉన్న ధాన్యాన్ని సిద్ధం చేస్తామన్నారు. ఈ మేరకు తూకాలు చేయించేందుకు డీఎస్‌వో అంగీకరించడం, తూకం చేసిన ధాన్యాన్ని చిట్యాల గోడౌన్‌కు తరలించేలా చర్యలు తీసుకోవడంతో రైతులు ధర్నా విరమించారు. కాగా ,రైతుల ధర్నాతో రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచి పోయాయి. రైతులు ధర్మానాయక్, నారాయణ నాయక్, రూప్లానాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పర్యటనలో అపశ్రుతి

- హెలీప్యాడ్ వద్ద తృటిలో తప్పిన ప్రమాదం
- సిగ్నల్ కోసం స్మోక్‌ఫైర్, ఎగిసిపడిన నిప్పురవ్వలు
- మంటలను అదుపు చేసిన పోలీసులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 19: నాగర్‌కర్నూల్‌లో జిల్లాలో శనివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకున్నది. హెలీక్యాప్టర్ దిగుతున్నంతగా సిగ్నల్స్ కోసం స్మోర్ ఫైర్ చేయడంతో నిప్పురవ్వలు ఎగసిపడి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన పోలీసులు మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి–2025పై అవగాహన కల్పించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మంతటి చౌరస్తా వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో సదస్సును ఏర్పాటు చేసింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు మంత్రి పొంగులేటి హెలీక్యాప్టర్‌లో వచ్చారు. కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌పై హెలీక్యాప్టర్ దిగుతుండగా సిగ్నల్ కోసం స్మోక్‌ఫైర్ చేశారు. దీంతో నిప్పురవ్వలు ఎగసిపడి హెలీక్యాడ్ చుట్టూ ఉన్న గడ్డికి అంటుకున్నాయి. మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన పోలీసులు గ్రీనరీకి అందించే నీటితో మంటలను ఆర్పివేశారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి రైతుల వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అమరచింత, ఏప్రిల్ 19: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ పథకం వర్తింపజేయాలని శనివారం మండలంలోని ధర్మాపూర్‌కు చెందిన 68మంది రైతులు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాసన్న, జమ్ములన్న, శ్రీనివాస్, రాములు, మణ్యం, అంజి, మహేశ్, అంజిలన్న తదితరులు మాట్లాడుతూ.. మాకందరికీ రెండు నుంచి నాలుగు ఎకరాల వరకు భూములు ఉండగా.. అమరచింత యూనియన్ బ్యాంకులో రూ.2లక్షల్లోపు రుణాలు ఉన్నాయి. ప్రభుత్వం వచ్చిన రుణమాఫీ మాకు వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ పూర్తయినదని చెబుతున్నా.. కేవలం నాలుగు వందల మంది రైతులున్న ధర్మాపూర్‌లో రూ. రెండు లక్షల లోపు రుణం ఉన్న 68 మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని.. మీరు మాపై శ్రద్ధ పెట్టి రుణమాఫీ వర్తించేలా చూడాలని ఎమ్మెల్యేకు రైతులు వినతిపత్రం అందజేశారు.

జేఈఈ మెయిన్‌లో వాగ్దేవి ప్రభంజనం

వాగ్దేవి కళాశాల విద్యార్థులతో కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి ఐఐటీ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాల్లో రోహిత్ 99.80 పర్సంటైల్, మనోహర్ 99.46 పర్సంటైల్, రేవంత్‌రెడ్డి 98 పర్సంటైల్ సాధించారని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. ఓంకార్, ఆర్తి, కౌశిక్, అశ్విని, మమత, నవనీత్‌గౌడ్, నవీన్, శివ, శరణ్య, గణేశ్ తదితరులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్‌తో సాధారణ విద్యార్థులు సైతం అసాధారణ ప్రతిభ కనబరిచి అద్వితీయ విజయం సాధించడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. జేఈఈ అడ్వాన్స్‌లోనూ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులు, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతా డేవి, యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు రాఘవేంద్ర రావు, శివకుమార్, నాగేందర్, సతీశ్‌రెడ్డి, ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, యాకూబ్, సందీప్, సాదియా గోవిందరాజులు, నాగరాజు, మహేశ్ గౌడ్, రాంరెడ్డి, శ్రావణి, సువర్ణ ఉన్నారు.

రిషి విద్యార్థుల జయకేతనం

విజయకేతనం ప్రదర్శిస్తున్న రిషి కళాశాల అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డీన్‌లు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: జాతీయ స్థాయి జేఈఈ ఫలితాల్లో రిషి విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తూ ఆల్ ఇండియా 1000లోగా ర్యాంకులు సాధించారు. ఎన్.రోహిత్‌రెడ్డి 308వ ర్యాంకు, జంగం శ్రీతులసి 927వ ర్యాంకు సాధించారని రిషి జూనియర్ కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళా మెకట్ తెలిపారు. సాయి సృజన్‌రెడ్డి 98.40 పర్సంటైల్, ఎస్.ప్రణీత్‌కుమార్ 98.04 పర్సంటైల్, సాయి అక్షయ 97.08 పర్సంటైల్, తరుణ్‌సాయి 96.76 పర్సంటైల్ సాధించగా.. 90పర్సంటైల్‌కు పైగా 36 మంది విద్యార్థులు సాధించారన్నారు. జేఈఈ అడ్వాన్స్‌కు 45 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను చైర్‌పర్సన్ చంద్రకళామెకట్, అకాడమిక్ చీఫ్ అడ్వైజర్ వెంకటయ్య, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌డ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ప్రతిభ విద్యార్థుల విజయఢంకా

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: జేఈఈ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోనే ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు ఘన విజయం సాధించారని ఆ కళాశాల యాజమాన్యం తెలిపింది. జిల్లా చరిత్రలోనే తొలిసారిగా ప్రతిభ కళాశాల విద్యార్థులు ఎం.విశాల్ (ఆల్ ఇండియా ర్యాంక్ 281), వి.సాకేత్‌కుమార్‌రెడ్డి (ఆల్ ఇండియా ర్యాంక్ 25 87), కే.భీంసింగ్‌రాథోడ్ (ఆల్ ఇండియా ర్యాంక్ 2683), ఎం.తిరుపతి (ఆల్ ఇండియా ర్యాంక్ (4952), కే.కేదార్‌నాథ్ (ఆల్ ఇండియా ర్యాంక్ 6988), ఎన్.వర్షిత్‌గౌడ్(ఆల్ ఇండియా ర్యాంక్ 7661), ఎస్.ప్రేమ్‌చంద్(ఆల్ ఇండియా ర్యాంక్ 7682) సాధించారన్నారు. వి.సాకేత్‌కుమార్‌రెడ్డి 98.75 పర్సంటైల్, కే.కేదార్‌నాథ్ 98.28 పర్సంటైల్, ఎన్.వర్షిత్‌గౌడ్ 98.15 పర్సంటైల్, జి.ఎల్ఎస్ఎస్.వాత్సల్య 98.06 పర్సంటైల్, ఎం.విశాల్ 97.12 పర్సంటైల్, కె.భరత్ 96.16, జి.జతిన్ 96.03, నాగ కౌశిక్ 96.95, యం.భానుప్రదీప్ 95.43, పి.సాయి జశ్వంత్‌రెడ్డి 95.39, సాయి రేవంత్‌రెడ్డి 95.04 పర్సంటైల్ సాధించారన్నారు. ఫలితాల్లో 90 పర్సంటైల్ ఆ పైన 48 మంది విద్యార్థులు, 80–90 పర్సంటైల్ మధ్యలో 62 మంది విద్యార్థులు ఉండగా.. మొత్తం 198 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ (ఐఐటీ) పరీక్ష రాసేందుకు అర్హత సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రతిభ కళాశాల డైరెక్టర్లు మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్లు

అక్షర విద్యార్థుల జయభేరి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల, ఐఐటీ–నీట్ అకాడమీకి చెందిన విద్యార్థులు జేఈఈ మెయిన్ సెషన్–2 ఫలితాల్లో అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. అకాడమికి చెందిన చరణ్‌తేజ సెషన్–1లో 98.78 పర్సంటైల్, సెషన్–2లో 95.43 పర్సంటైల్ సాధించి ఓవరాల్ రిజల్ట్స్‌లో 98.78 పర్సంటైల్ సాధించారన్నారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు శృతి, హర్షవర్ధన్, హస్‌నైన్, అభీల్‌తోపాటు పలువురు విద్యార్థులు 80పర్సంటైల్‌కు పైగా సాధించారని తెలిపారు. యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

అక్షర కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్